
బాల్యం.. క్రీడలకు దూరం

- పెనుగంచిప్రోలు మండలంలో పీడీలు కరువు
- ఏడు జెడ్పీ పాఠశాలకు ముగ్గురే వ్యాయామోపాధ్యాయులు


రెండేళ్లుగా పీడీ లేని కొణకంచి జెడ్పీ హైస్కూల్

పెనుగంచిప్రోలు: విద్యార్థి దశలో విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యం. మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించే అవకాశం ఉంటుంది. ప్రతి హైస్కూల్‌కు ఒక వ్యాయామోపాధ్యాయుడు అవసరం ఉంది. వారు ఆటలు నేర్పించటంతో పాటు విద్యార్థుల క్రమశిక్షణ బాధ్యత కూడా తీసుకుంటారు. అదే సమయంలో పిల్లలు క్రీడల్లో పాల్గొందడం ద్వారా వారి శారీరక, మానసిక ఉల్లాసానికి దూరమవుతున్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని పాఠశాలల్లో పీడీ, పీఈటీలు లేక పోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న పలు ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది. కానీ నేడు పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత లోపించింది. గత ప్రభుత్వంలో ఆడుదాం–ఆంధ్రా పేరుతో ప్రతి గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించి వాటి ప్రాధాన్యతను తెలియజేసింది.

మండలంలో ముగ్గురే..

పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం 7 జిల్లా పరిషత్ హైస్కూల్స్ ఉండగా ఇద్దరు పీడీలు మాత్రమే ఉన్నారు. పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు ఇద్దరు పీడీలు ఉండగా, శనగపాడు జెడ్పీ హైస్కూల్‌లో పీఈటీ ఉన్నారు. పెనుగంచిప్రోలు బాలికల హైస్కూల్‌కు పీడీ పోస్టే లేదు. కొణకంచి జెడ్పీ హైస్కూల్‌కు రెండేళ్లుగా పీడీ లేరు. కొళ్లికూళ్ల, అనిగండ్లపాడు, ముండ్లపాడు హైస్కూల్‌కు కూడా ఏడాదిగా ఫిజికల్ డైరెక్టర్స్ లేకుండా ఉన్నారు. దీంతో విద్యార్థులు ఆటలకు పూర్తిగా దూరమయ్యారు. దీనిపై త్వరలో ఉపాధ్యాయుల బదలాయింపులతో పీడీ, పీఈటీ పోస్టులు వస్తాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆటలకు దూరమవుతున్నారు



వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. అమూల్యమైన బాల్య దశలో క్రీడలు చాలా అవసరం. వారి మానసిక, శారీరక ఉల్లాసానికి ఇవి దోహదం చేస్తాయి. ప్రభుత్వం వ్యాయామోపాధ్యాయులను నియమిస్తే బాలబాలికలకు మేలు జరుగుతుంది.

– దారా వెంకటేశ్వరరావు, పెనుగంచిప్రోలు

క్రమశిక్షణ లోపిస్తోంది..



మా గ్రామంలోని హైస్కూల్‌లో పీడీ లేక ఏడాది అవుతోంది. వారు ఉంటే పాఠశాలలో మంచి విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ కూడా ఉంటుంది. విద్యార్థులను వారు గమనిస్తూ సూచనలిస్తుంటారు. క్రీడలు లేకపోతే విద్యార్థుల్లో చురుకుదనం కూడా లోపిస్తోంది.

– జొన్నలగడ్డ కిషోర్, సర్పంచ్, కొళ్లికూళ్ల

క్లుప్తంగా

ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రధానోపాధ్యాయుడు సైదులు ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదో తరగతి పూర్తి చేసిన పలువురు విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో అడ్మిషన్లు ఇచ్చారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, బాల్య, నేలవెల్లి రమేష్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



నందిగామ టౌన్: పట్టణంలోని సయ్యద్ ఖాజా షఫీ ఉల్లా హుస్సేనీ 32వ గంధ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిన్న మసీదు వద్దనున్న ఉర్దూ పాఠశాల నుంచి మేళతాళాలతో గంధోత్సవాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి పెద్ద మసీదులో సయ్యద్ షా ఖాజా సఫీఉల్లా హుస్సేనీ దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సిబ్కాతుల్లా హుస్సేనీ, మహారాష్ట్రకు చెందిన రఫిక్ ఆలం హుస్సేనీలు ముస్లిం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సీతారామపురం, చింతల తోపులో వేంచేసి యున్న శ్రీవరసిద్ధి వినాయకుని ఆలయ 11వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి 108 లీటర్ల చెరుకు రసం, 108 లీటర్ల ఆవుపాలు, 108 లీటర్ల పెరుగు, 108 లీటర్ల బెల్లం పానకంతో అభిషేకం నిర్వహించారు. అలాగే 108 కిలోల బెల్లంతో అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో నాగలక్ష్మి అమ్మవారి దేవస్థానం అర్చకులు మూర్తి సాంబ శివశర్మ, దేవాలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సహస్ర ఉండ్రాళ్ల కార్యక్రమం జరిపించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దుర్గగుడి అభివృద్ధి పనుల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను టెక్నికల్ బృందం మంగళవారం పరిశీలించింది. ఇంద్రకీలాద్రిపై పూజా మందిరం, అన్నదాన భవనం, ప్రసాదాల పోటు, క్యూలైన్ కాంప్లెక్స్ పనులను చేపట్టింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న పూజా మండపాలు పనులు దాదాపు పూర్తి కావస్తుండగా, అన్నదానం, ప్రసాదాల పోటు భవనాలు కీలక దశకు చేరుకున్నాయి. దీంతో దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్రమోహన్, మాస్టర్ ప్లాన్ ప్రధాన సలహాదారు కొండలరావు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శేఖర్, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావు అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను పరిశీలించిన టెక్నికల్ బృందం ఆలయ ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ ఎదుట రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణంపై టెక్నికల్ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసింది.

ఇబ్రహీంపట్నంలో అంగన్‌వాడీల నిరసన

ఇబ్రహీంపట్నం: మండుతున్న ఎండల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ డిమాండ్ చేసింది. ఇబ్రహీంపట్నంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో వేసవి సెలవులు మంజూరు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ గతంలో సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా ఏర్పాటు చేయాలని, విధి నిర్వహణలో ఉన్న వారందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ బెనిఫిట్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వివిధ సెక్టార్ల లీడర్లు బుల్లెమ్మ, నిర్మల, రబ్బానీ, ముంతాజ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు


ప్రాథమిక పాఠశాలలో చేరిన అంగన్‌వాడీ చిన్నారులు


పేటలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే


చిన్నారుల ఎత్తు, బరువు పరిశీలిస్తున్న ట్రస్ట్ డీపీవో, తదితరులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పోషకాహార పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈనెల 8 నుంచి 22 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్షోత్సవాల్లో భాగంగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. ముండ్లపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేసి చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాజా, ఉపాధ్యాయులు స్వరూపారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, జ్యోతి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొణకంచిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి కె. వాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించటంతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం..

నందిగామ రూరల్: పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాలు తీసుకోవటం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని విజయ వాహిని చారిటబుల్ ట్రస్ట్, టాటా ట్రస్ట్ డీపీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలోని అంగనవాడీ కేంద్రాన్ని ఇన్‌చార్జ్ సీడీపీవో కృష్ణకుమారితో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లోని ఎదుగుదలపై దృష్టి సారించాలన్నారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు అందించటంతో పాటు పౌష్టికాహారం, చిరుధాన్యాలు తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ట్రస్ట్ ప్రతినిధి భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్‌లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాభి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు..

జగ్గయ్యపేట అర్బన్: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఒకటో వార్డులోని 3వ సెంటర్‌లో ఐసీడీఎస్ చిల్లకల్లు ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో నాగమణి ఆదేశాల మేరకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రీ స్కూల్ పూర్తి చేసుకున్న పిల్లలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆలేటి జ్యోతిరాణి, ఎస్.పద్మజశ్రీ, కె.నాగలక్ష్మి, ఎస్‌కే నగీనా, ఎం.మహాలక్ష్మి, తిరుపతమ్మ, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంటనే లింగాల బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ కొలుసు రమాదేవి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు, పక్కన ఎంపీపీ రమాదేవి, తదితరులు

వత్సవాయి: ఎంతో ప్రాధాన్యం ఉన్న లింగాల బ్రిడ్జి మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఎంపీపీ కొలుసు రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిడ్జి వరదలకు పూర్తిగా ధ్వంసమై 8 నెలలు అవుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవటం లేదని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కన్నెవీడు ఎంపీటీసీ సభ్యురాలు లావుడియా లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ రాంబాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలు వచ్చాయని, వాటితో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, వైస్ ఎంపీపీలు కాటేపల్లి రామలక్ష్మి, కొలుకుపోగు వెంకటేశ్వర్లు, ఎంఈఓ నాగరాజు, వైద్యాధికారి అర్షిదబేగం, ఈఓపీఆర్‌డీ మాధవి, పీఆర్ ఏఈ సుందర రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా అవసరం


బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీఐ

నందిగామ టౌన్: సైబర్ నేరాలపై వినియోగదారులకు అవగాహన కలిగించటంతో పాటు అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకు అధికారులు దృష్టి సారించాలని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు, తదితర అంశాలపై పట్టణంలోని బ్యాంకు అధికారులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అమాయకులను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా జరిగే లావాదేవీలపై నిఘా ఉంచాలని ఏవైనా అనుమానాస్పదంగా ఉంటే వినియోగదారుడితో మాట్లాడి నిర్ధారించుకుని ప్రక్రియను పూర్తి చేసేలా చూడాలని సూచించారు. అంతే కాకుండా సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించటంతో పాటు పూర్తి స్థాయిలో కెమెరాలు పని చేసేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యుడు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం

సాక్షి స్పందన


పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది


ప్రధాన రహదారిపై డ్రెయిన్‌కు పైప్‌లు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

లింగగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని లింగగూడెం గ్రామంలో మంగళవారం పంచాయతీ అధికారులు మురుగు కాలువలు శుభ్రం చేయటంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించారు. సాక్షి దినపత్రికలో ఈనెల 21న 'గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం' అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామస్తులు కూడా పారిశుద్ధ్య సమస్య నివారణకు సహకరించాలని అధికారులు కోరారు. సమస్య పరిష్కారం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మురుగు సమస్యకు పరిష్కారం..

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో రహదారిపై పారుతున్న మురుగుపై మంగళవారం గ్రామాలలో 'అధ్వానంగా పారిశుద్ధ్యం' శీర్షికతో వార్తను సాక్షి దినపత్రిక ప్రచురించింది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రధాన రహదారిపై అధ్వానంగా ఉన్న డ్రెయిన్‌లో పూడిక తీయించి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. మురుగు నీటి సమస్యను పరిష్కరించటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జెడ్పీ పాఠశాల క్రీడా మైదానం ప్రారంభం


క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 4.25 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన క్రీడా మైదానాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ముఖ్యంగా డాక్టర్ సర్వేపల్లి విద్యా కిట్‌లను రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలకు అందుతాయని తెలిపారు. అనంతరం విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులను పంపిణీ చేసి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల రాంబాబు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి తుర్లపాడు ఉరుసు ఉత్సవాలు


ట్రాక్టర్‌పై ఎడ్లబండిని ఎక్కించి తీసుకెళ్తున్న పెండ్యాల ముస్లింలు

కంచికచర్ల: చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో కొలువై ఉన్న బడేమియా హజరత్ ఉరుసు ఉత్సవాలు బుధ, గురువారాల్లో జరుగనున్నాయి. రెండురోజుల పాటు దర్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ ఉరుసు ఉత్సవాలకు పెండ్యాల గ్రామానికి చెందిన ముస్లింలంతా ఇళ్లకు తాళాలు వేసి తరలి వెళ్తారు. అయితే ఎక్కువ మంది ఎడ్ల బండ్లపై బండెనెక బండి కట్టి తరలి వెళ్తారు. కొంతమంది ట్రాక్టర్లు, ఆటోల ద్వారా వెళ్తుంటారు. ఎడ్ల బండ్లను హిందువులు ఉచితంగానే పంపిస్తారు. చిలకలూరిపేట, నరసారావుపేట, గుంటూరు, సూర్యాపేట, ఖమ్మం, వైరా, మదిర, తదితర ప్రాంతాల నుంచి ఎడ్ల బండ్లు వస్తాయి. ఎడ్లబండ్లతో పాటు హిందువులు కూడా ఈ ఉత్సవాలలో పాల్గొంటారు. పెండ్యాల సంతతికి చెందిన ముస్లింలు ఏ ప్రాంతంలో ఉన్నా సరే కార్లు, బస్సులు, విమానాల ద్వారా వచ్చి ఉరుసు కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ఎడ్ల బండ్లు పెండ్యాల గ్రామ సమీపంలోని మున్నేరు నుంచి వెళ్తుంటాయి. ఆ ఎడ్ల బండ్లను తిలకించేందుకు ఇతర గ్రామాల నుంచి వస్తుంటారు. కులమతాలకు అతీతంగా జరిగే ఉరుసు ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అరుంధతీ దేవి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో మంగళవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలతో పాటు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అవసరమైతే తాగునీటి సరఫరా కాని ప్రాంతాలలో ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా గ్రామాలలోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే సమాజ అభ్యున్నతి


మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ వెంకటరమణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలోని ప్రతి మహిళ విద్యావంతురాలై సాధికారత సాధించినప్పుడే సమాజ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏపీహెచ్ఈఆర్ అండ్ ఎంసీ చైర్మన్ ఎం.వెంకటరమణ అన్నారు. కేబీఎన్ కళాశాల యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ.. మహిళ ప్రతి కుటుంబానికి వెన్నెముక అని, మహిళ ఆర్థికంగా ఎవరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. విద్యావ్యవస్థను వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ సేవగా నిర్వహించాలని సూచించారు. కేబీఎన్ కళాశాల యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ దిగువ మధ్యతరగతి కుటుంబాలకు తమ కళాశాల పూర్తిగా అండగా ఉంటుందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళ ప్రస్తుత సమాజంలో వంటింటి నుంచి అంతరిక్షం దాకా ప్రజారంగంలోనూ పురుషులను మించి విజయాలు సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ అధ్యక్షత వహించారు. ఉమెన్ స్టడీ సెంటర్ ఇన్‌చార్జి పి.స్వప్న, అధ్యాపకులు గౌతమీ దేవి, స్వాతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

తిరువూరు: పొలం పనికి వెళ్లిన వ్యక్తి పాము కాటుకు గురై మృతి చెందాడు. తిరువూరు మండలం జి. కొత్తూరుకు చెందిన శీలం కృష్ణారెడ్డి (52) మంగళవారం ఉదయం పొలం పనికి వెళ్లాడు. అక్కడ పాము కాటు వేయగా చుట్టుపక్కల రైతులు ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. సర్పంచి వెంకట్రావమ్మ భర్త అయిన కృష్ణారెడ్డి గతంలో టేకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. కృష్ణారెడ్డి మృతికి వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వేడుకగా వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు


చందన అలంకారంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సుప్రభాత సేవ, చందనాలంకరణ సేవ, స్వామి వారి మూలవరులకు అష్టోత్తర కలశ స్నపన, (108 కలశాలతో అభిషేకం) అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి విశేష పూజలు చేశారు. నిత్యహోమం, బలిహరణ, మహానివేదన, నిత్యోపాసన కార్యక్రమాలను అర్చకుడు పరాశరం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హనుమేశ్వరరావు, సూరె వెంకట రామారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

పెనుగంచిప్రోలు: మండలంలోని షెడ్యూల్డ్ కులాల వారికి ఎన్టీఆర్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం నుంచి రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ జి. శ్రీను మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి మే 10వ తేదీ తుది గడువుగా నిర్ణయించారన్నారు. మండలంలోని అనిగండ్లపాడు కెనరా బ్యాంక్–6, పెనుగంచిప్రోలు కేడీసీసీ బ్యాంక్–6, నవాబుపేట సప్తగిరి గ్రామీణ బ్యాంక్–5, పెనుగంచిప్రోలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–5, పెనుగంచిప్రోలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా– 5, కొణకంచి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–5 మొత్తం 32 మందికి బ్యాంక్‌ల వారీగా రుణాలు ఇచ్చేందుకు టార్గెట్ ఉందన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. బ్రాహ్మణ వీధిలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తీసుకువచ్చి కల్యాణ వేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం..

స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. సహస్రనామార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

లక్ష్మీనరసింహ స్వామికి రూ. 7.6 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారికి భూముల బహిరంగ కౌలు వేలం ద్వారా రూ. 7,06,500 ఆదాయం వచ్చిందని ఈవో సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి చెందిన 160.77 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా పై ఆదాయం వచ్చిందన్నారు. వేదాద్రి, రావిరాల, బండిపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారని రెండు వేలాలకు పాటదారులు రాకపోవటంతో వాయిదా వేశామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు జయప్రకాష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీకి వయో పరిమితి పెంచాలని వినతి

తిరువూరు: డీఎస్సీ–2025 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు తమకు వయో పరిమితి పెంచాలని 2024లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసినప్పుడు తమకు వయో పరిమితి సరిపోయిందని, సుమారు ఏడాది గడిచినందున తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరించడం లేదని పలువురు అభ్యర్థులు వాపోయారు. ప్రభుత్వమే డీఎస్సీ నోటిఫికేషన్ జారీలో జాప్యం చేసినందున తదనుగుణంగా కటాఫ్ తేదీలో మార్పులు చేసి తమకు కూడా అవకాశం కల్పించాలని కోరారు.